## ఇక బడుగు వ్యాపారుల పైనా జీఎస్టీ!

న్యూఢిల్లీ, మే 24: మధ్య స్థాయి నుంచి భారీ స్థాయిలో వ్యాపారం చేసే వారిని లక్ష్యంగా చేసుకుని ఎడాపెడా జీఎస్టీ భారాన్ని విధించిన కేంద్రం ఇప్పుడు బడుగు, బలహీన వర్గాలను కూడా పన్ను పరిధిలోకి తేవాలని తహతహలాడుతున్నది. అనధికారిక ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించి వారిని కూడా జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) తన ఫీల్డ్ అధికారుల ద్వారా ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. నమోదు కాని సంస్థల ద్వారా పన్ను ఎగవేతలను నిరోధించి నగదు ఆధారిత, లెక్కల్లో చూపని లావాదేవీలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ధ్యేయంగా నిర్ణయించుకుంది. ఇదే కనుక అమలైతే ఇక నుంచి బజ్జీల బండి వాళ్లు, బండ్లపై అరటి పండ్లు అమ్ముకునే వారితో పాటు రోడ్డు పక్కన ఉండే మెకానిక్‌లు, సైకిల్ షాపు వాళ్లు, టైర్లకు గాలి కొట్టేవారు.. ఇలా ఒకరేమిటి రోడ్డుపక్కన తోటకూర అమ్ముకునే తాత నుంచి, రేగు పండ్లు అమ్ముకునే మామ్మ వరకు అందరిపై జీఎస్టీని ఎడాపెడా విధించడానికి కేంద్రం చకచకా పావులు కదుపుతున్నది.

## డీ-మెర్జింగ్‌తో వాటాదారులకు లాభమే

టాటా మోటర్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



నూఢిల్లీ, మే 24: టాటా మోటర్స్‌ను విడగొట్టే ప్రతిపాదనతో దీర్ఘకాలికంగా వాటాదారులకు లాభం చేకూరనున్నదని కంపెనీ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. కంపెనీ 80వ వాటాదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టాటా మోటర్స్‌ను రెండు సంస్థలుగా విడగొట్టి కమర్షియల్ వాహనాలు, ప్యాసింజర్ వాహన విభాగాలుగా విడగొట్టి స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే వాటాదారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఈ ఏడాది రెండో అర్ధభాగం నాటికి టాటా మోటర్స్ రెండు సంస్థలుగా మారబోతున్నది. వ్యాపార వ్యూహాత్మకంలో భాగంగా పలు సంస్థలను విడగొట్టాలని నిర్ణయించినట్టు, దీంతో గ్రూపు ఆర్థికంగా బలోపేతం కావడంతోపాటు వాటాదారులకు లబ్ధిచేకూరనున్నదని ఆయన వ్యాఖ్యానించారు.




# గిన్నిస్‌బుక్‌లో ఎల్ఐసీ

**24 గంటల్లో 5.88 లక్షల పాలసీల విక్రయంతో రికార్డు**

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మరో అరుదైన ఘనతను సాధించింది. కేవలం 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలను విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన తమ పనితీరుకు గుర్తుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు గుర్తించిందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 20న కంపెనీకి చెందిన 4,52,839 ఏజెంట్లు ఒక్కో పాలసీ చొప్పున 5,88,107 జీవిత బీమా పాలసీలను విక్రయించారు. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలను విక్రయించడం ఇదే తొలిసారని తెలిపింది. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం రోజైన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించుకొని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్కో పాలసీ అయిన పూర్తి చేయాలన్న కంపెనీ ఎండీ, సీఈవో సిద్దార్థ మొహంతీ విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను సాధించినట్లు వెల్లడించారు. ఈ అరుదైన మైలురాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు.




# సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు

ఈవీను విడుదల చేసిన చైనా సంస్థ షియోమీ

న్యూఢిల్లీ, మే 24: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ షియోమీ మరో అడుగుముందుకేసింది. ఇప్పటికే తన తొలి మాడల్‌కు విశేష స్పందన లభిస్తున్న ప్రస్తుత తరుణంలో మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వైయూ7 పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. టెస్లాకు చెందిన వై మాడల్‌కు పోటీగా ఈ కారును ప్రవేశపెట్టింది. ఇప్పటికే విడుదల చేసిన ఎస్‌యూ7 సెడాన్ 2.58 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి.

**ఈ నూతన కారు ప్రత్యేకతలు..**

- సింగిల్ చార్జింగ్‌తో 835 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అత్యధిక మైలేజీ ఇచ్చే మూడో మాడల్ ఇదే కావడం విశేషం.
- 96.3 కిలోవాట్ల ఎల్ఎఫ్‌పీ బ్యాటరీతో తీర్చిదిద్దింది. కేవలం 3.23 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ మాడల్ గంటకు 253 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- ప్రో మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 770 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.

# ఎఫ్‌డీఐలు తిరోగమనం

## 2024-25లో భారీగా తగ్గిన విదేశీ పెట్టుబడులు



న్యూఢిల్లీ, మే 24: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో నరేంద్ర మోదీ సర్కార్ విఫలమవుతున్నది. గడిచిన కొన్నేండ్లుగా తగ్గుముఖం పట్టిన ఎఫ్‌డీఐలు..గడిచిన ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా పడిపోయాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లోకి కేవలం 353 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం ఏడాది వచ్చిన 10 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలతో పోలిస్తే 96.5 శాతం తగ్గాయని పేర్కొంది. అంతక్రితం ఏడాది రికార్డు స్థాయి ఎఫ్‌డీఐలను ఆకర్షించిన భారత్.. ఆ మరుసటి ఏడాదే భారీగా పడిపోవడం విశేషం. కానీ, విదేశాల్లో పెట్టుబడులు పెట్టే దేశీయ కంపెనీలు భారీగా పెరుగుతున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఆయా సంస్థలు 29 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాయి. అంతక్రితం ఏడాది పెట్టిన 17 బిలియన్ డాలర్ల కంటే ఇది 50 శాతానికి పైగా అధికం.

**విదేశీ పెట్టుబడిదారులు దూరం**

ప్రపంచ దేశాల్లో భారత్ అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నప్పటికీ విదేశీ పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తిని కనబర్చడం లేదు. దీంతో గడిచిన కొన్నేండ్లుగా భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు..గతేడాది పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేశారు. కానీ, దేశీయ ఈక్విటీ మార్కెట్లపై మాత్రం ఎనలేని ప్రేమను కురిపిస్తున్నారు. ఇతర దేశాల ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే సెన్సెక్స్, నిఫ్టీలు రెండంకెల స్థాయిలో రాబడిని పంచడమే ఇందుకు కారణం. మొత్తంగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌డీఐలు 13.7 శాతం పెరిగి 81 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటిలో సగం ఐపీవోకి వచ్చిన సంస్థల్లో ఇన్వెస్ట్ చేశారు. 2023-24 సంవత్సరంలో విదేశీ పెట్టుబడిదారులు 49 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, ఆల్ఫా వేవ్ గ్లోబల్ అండ్ పార్టనర్స్ గ్రూపు, స్విగ్గీ, విశాల్ మెగా మార్ట్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐలు అత్యధికంగా వచ్చాయి. అలాగే అల్టర్‌నెటివ్ క్యాపిటల్ అసోసియేషన్(ఐవీసీఏ), ఈవై, పీఈ/వీసీ ల నుంచి 26.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. హ్యుందాయ్ మోటర్ ఇండియా తన వాటాను 100 శాతం నుంచి 82.5 శాతానికి తగ్గించుకోవడంతో రూ.27,870 కోట్ల నిధులు సమకూరగా, అలాగే స్విగ్గీ కూడా 2 బిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. వీటితోపాటు టెలికం దిగ్గజం సింగ్‌టెల్..భారతీ ఎయిర్‌టెల్‌లో తనకున్న వాటాను మొత్తం విక్రయించగా, అలాగే బ్రిటిష్ అమెరికన్ టొబాకో(బీఏటీ)..ఐటీసీలో ఉన్న తన మొత్తం వాటాను విక్రయించింది. గతేడాది సెప్టెంబర్ నెలలో దేశీయ ఈక్విటీ మార్కెట్లు రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో ఒక్కో విదేశీ కంపెనీలు..దేశీయ పెట్టుబడులను ఉపసంహరించుకున్నాయి.

### తయారీ రంగానికి బ్రేకులు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆకట్టుకోవడంలో తయారీ రంగంతోపాటు ఆర్థిక సేవలు, ఎనర్జీ, కమ్యూనికేషన్ రంగాలు విఫలమయ్యాయి. గత కొన్నేండ్లుగా ఈ రంగాలు ఆశాజనక పనితీరు కనబర్చలేకపోవడంతో విదేశీ పెట్టుబడిదారులు వీటివైపు కన్నెత్తి కూడా చూడలేదు. తయారీ, ఆర్థిక సేవలు, ఎనర్జీ, టెలికం రంగాల్లోకి ఎఫ్‌డీఐలు భారీగా తగ్గడం మొత్తం ఎఫ్‌డీఐలపై ప్రతికూల ప్రభావం చూపాయని సెంట్రల్ బ్యాంక్ తాజా నివేదికలో వెల్లడించింది.

## హైదరాబాద్‌లో యంత్రాల ఎగ్జిబిషన్

హైదరాబాద్, మే 24: దక్షిణాదిలో అతిపెద్ద బీ2బీ ఇండస్ట్రీయల్ యంత్రాలు అండ్ ఇంజినీరింగ్ ఎగ్జిబిషన్‌కు మరోసారి హైదరాబాద్ వేదికైంది. నాలుగోసారి జరుగుతున్న ఈ ఎగ్జిబిషన్‌లో ఇంజినీరింగ్, మౌలిక రంగానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. మెషిన్ టూల్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, వెల్డింగ్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇంజినీరింగ్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు.

## బ్రోక్‌ఫిల్డ్ భారీ పెట్టుబడులు

న్యూఢిల్లీ, మే 24: అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ బ్రోక్‌ఫిల్డ్..భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. వచ్చే ఐదేండ్లకాలంలో తన ఆస్తులను 100 బిలియన్ డాలర్ల స్థాయిలో పెంచుకోవడానికి భారీగా ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నది. ప్రస్తుతం సంస్థ భారత్‌లో 30 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులు కలిగివున్నది. మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, రెన్యూవబుల్ ఎనర్జీ, ప్రైవేట్ ఈక్విటీల్లో తన అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ కలిగివున్నది.

# ఎఫ్ఐఐల 5 వేల కోట్లు వెనక్కి

## గతవారంలో తరలించుకుపోయిన విదేశీ ఇన్వెస్టర్లు

న్యూఢిల్లీ, మే 24: దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత వారంలోనూ రూ.5 వేల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో ఈ నెల 19 నుంచి 23 మధ్యకాలంలో ఈక్విటీల నుంచి రూ.4,784.32 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎఫ్ఐఐల పెట్టుబడులు రూ.18,620 కోట్ల నుంచి రూ.13,835 కోట్లకు తగ్గాయని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఐదు సెషన్లలో విదేశీ పెట్టుబడిదారులు అత్యధికంగా తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు గతవారంలో ఒకేరోజు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి ఎఫ్ఐఐలు రూ.98,516 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..యూరోపియన్ దేశాలపై ప్రతీకార సుంకాలను 50 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించారు. దేశీయ ఆర్థిక మూలాలపై ఎలాంటి ప్రభావం లేదని, కేవలం అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల వల్లనే ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకుంటున్నారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో ఎఫ్ఐఐలు రూ.4,223 కోట్ల పెట్టుబడులు పెట్టగా, మార్చి నెలలో రూ.3,973 కోట్ల విలువైన స్టాక్స్‌ను కొనుగోలు చేశారు. కానీ, జనవరి నెలలో రూ.78 వేల కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.



## ఎన్టీపీసీ రూ.33.50 డివిడెండ్

న్యూఢిల్లీ, మే 24: ప్రభుత్వరంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.7,897.14 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,490.05 కోట్ల లాభంతో పోలిస్తే భారీగా వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.48,816.55 కోట్ల నుంచి రూ.51,085 కోట్లకు ఎగబాకింది. దీంట్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సంస్థకు రూ.49,352 కోట్ల ఆదాయం సమకూరింది. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,90,862.45 కోట్ల ఆదాయంపై రూ.23,953.15 కోట్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు, 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.33.50 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. గతేడాది కొత్తగా 3,972 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రావడంతో మొత్తం కెపాసిటీ 79,930 మెగావాట్లకు చేరుకున్నది.



కాచిరెడ్డిపల్లిలో పిడుగు పడి మరణించిన ఎడ్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

## పిడుగు పాటుకు జోడెడ్ల మృతి

గంగాధర, మే 24: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగుపాటుతో కాచిరెడ్డిపల్లి గ్రామంలో దేశెట్టి వీరమల్లయ్యకు చెందిన జోడెడ్లు మృతిచెందాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి రైతుతో మాట్లాడారు. ఎడ్ల ఆధారంగా వీరమల్లయ్య వ్యవసాయ చేసుకుంటూ జీవిస్తున్నాడని, పిడుగుపాటుకు మృతిచెందడంతో రూ.2 లక్షల నష్టం వచ్చిందని, ప్రభుత్వం రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హైదరాబాద్ నుంచి బాధిత రైతుతో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం తరపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తహసీల్దార్ అనుపమ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ మాజీ సర్పంచ్ జోగు లక్ష్మీరాజం ఉన్నారు.

## తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి

కార్పొరేషన్, మే 24 : నగరంలో ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ స్వచ్ఛ ఆటో కార్మికులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కళాభారతిలో పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగు పరచాలని సూచించారు. నగర పరిసర ప్రాంతాలతో పాటు కలెక్షన్ పాయింట్ల వద్ద చెత్త కనిపించకుండా స్వీపింగ్ చేసి, ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సంబంధిత జవాన్, ఎస్సైల పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రోజు స్వచ్ఛ ఆటో కార్మికులు ఇంటింటికీ తిరిగి చెత్తను వేరుగా సేకరించాలని, తడిపొడి చెత్తను ఇంట్లోనివారే వేరు చేసి అందించాలనే విషయాన్ని వివరించాలని, అవగాహన కల్పించాలని సూచించారు. ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ స్వామీ, వెటర్నరీ అధికారి, ఎస్సైలు జవానులు, స్వచ్ఛ ఆటోల డ్రైవర్లు ఉన్నారు.

## గర్భిణికి రక్తదానం

రామడుగు, మే 24: ఆపదలో ఉన్న గర్భిణికి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు ఓ యువకుడు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తీగలగుట్టపల్లికి చెందిన అనూషకు పురిటినొప్పుల రావడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. ఆపరేషన్ కోసం ఏబీ నెగెటివ్ బ్లడ్ గ్రూప్ రక్తం రెండు యూనిట్లు అవసరం కాగా, కుటుంబ సభ్యులు పది రోజులుగా దాతల కోసం చూస్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్ ఎస్వీజేసీ కళాశాల అధ్యాపకుడు మురళీకృష్ణ సహకారంతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు అభిమాని ఆరెపల్లి ప్రశాంత్‌కు సమాచారం ఇవ్వగా, అతను ఓ బ్లడ్ బ్యాంకు నుంచి ఒక యూనిట్ రక్తం ఇప్పించాడు. మరో యూనిట్ రక్తాన్ని కిష్టంపల్లికి చెందిన జిల్లెల్ల అజయ్ దానం చేశాడు. కాగా, శుక్రవారం రాత్రి అనూష పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. రక్తదానం చేసిన అజయ్, అందుకు సహకరించిన ప్రశాంత్‌కు అనూష కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# రూ.50 వేలు ఇస్తే ఇందిరమ్మ ఇల్లు

- పైసలిస్తేనే మంజూరు చేస్తున్నరు
- మానకొండూర్ నియోజకవర్గంలో ఇండ్ల దందా జరుగుతోంది
- 'రాజీవ్ యువ వికాసం' కూడా అంతే..
- మాజీ ఎమ్మెల్యే రసమయి సంచలన ఆరోపణలు




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పక్కన జీవీఆర్, నాయకులు

తిమ్మాపూర్, మే24: మానకొండూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల దందా నడుస్తున్నదని, 'రూ.50వేలు కొట్టు.. ఇల్లు పట్టు' అని లబ్ధిదారులకు ఆఫర్ ఇస్తున్నారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సంచలన ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు తెలిసే ఇదంతా జరుగుతున్నదా..? అని ప్రశ్నించారు. శనివారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను సెలెక్ట్ చేసి గ్రామ సభ తీర్మానం ద్వారా కలెక్టర్ లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. కానీ మానకొండూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ నిబంధనలు, జీవో ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరగడం లేదన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, స్థానిక కాంగ్రెస్ లీడర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టంవచ్చిన వారికి, కార్యకర్తలకు ఇండ్లు ఇచ్చుకుంటూ అర్హులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఇలా ఇష్టం వచ్చినట్లు చేస్తూ ఉంటే ఊరుకోబోమని, ఇందిరమ్మ ఇండ్ల పేరుకు బదులు కాంగ్రెస్ గృహ జ్యోతి అని పెట్టుకుంటే తాము 'మీ జోలికి రాబోమని' స్పష్టం చేశారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటికి రూ.50వేలు ఇస్తేనే లిస్ట్‌లో పేరు వస్తుందంటూ బహిరంగంగా దందా చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి ఇందిరమ్మ ఇండ్ల దందాతో కార్యకర్తలకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. రూ.50వేలలో వారికి సగం, పైకి సగం వెళ్తాయని స్వయంగా ఓ గ్రామ కాంగ్రెస్ లీడర్ చెప్పాడని రసమయి పేర్కొన్నారు. అలాగే ఓ మండలానికి చెందిన విలేకరి పేరు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో రాగా, ఆయన నుంచి సైతం రూ.50వేలు వసూలు చేశారని, తన దగ్గర అన్ని సాక్ష్యాలున్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం నియోజకవర్గంలో 42వేల మంది ప్రజాపాలన సభల్లో దరఖాస్తు చేస్కున్నారని, కానీ నేడు కేవలం 3,500మందికే ఇండ్లు ఇస్తామని ఎమ్మెల్యే చెబుతున్నారని, అయితే మిగిలిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఆ కొద్ది మందిలో సైతం అనేక కొర్రీలు పెడుతూ తిరస్కరిస్తున్నారని విమర్శించారు. మానకొండూర్ మండలంలో నిజాయితీగా డెంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రెండు, మూడు ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోసి వెళ్తుంటే.. మిగతా లబ్ధిదారులు తమ పరిస్థితేంటని అడిగారని, అంతా తమ నాయకులు చూసుకుంటారని అనడంతో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇండ్ల విషయంలో నాయకుల జోక్యం ఎందుకుందని ప్రశ్నించారు. నిజాయితీగా గ్రామ సభపెట్టి గ్రామంలో లబ్ధిదారులు ఒక్కరే ఉంటే ఒకరికే ఇవ్వాలని, లేకపోతే ఒక్క ఇల్లుకు ఎంతో చెబితే తాము ఏదో విధంగా కష్టపడి మీకు చెల్లిస్తామని, అర్హులైన పేదలకు మేమైనా ఇప్పిస్తామన్నారు. లబ్ధిదారులు తన వద్దకు వచ్చి రూ.50వేలు ఎక్కడికెళ్లి తెస్తామని గోడు వెళ్లబోసుకుంటున్నారని, ఇది సరి కాదన్నారు.

**కమీషన్లు ఇచ్చేటోళ్లకే రాజీవ్ యువవికాసం**

రాజీవ్ యువవికాసం కూడా కాంగ్రెస్ కార్యకర్తలకే చేయూత ఇచ్చేందుకు పెట్టారని ఎద్దేవా చేశారు. ఇందులో కూడా కమీషన్లు ఇచ్చేవారినే సెలెక్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కాకముందే ఇందులో కూడా దందా మొదలైందన్నారు. తానేం గాలిమాటలు ఆరోపణలు చేయడం లేదని పక్కా ఆధారాలతోనే మాట్లాడుతానని స్పష్టం చేశారు. అన్ని ఆధారాలతో సీఎంఆర్ఎఫ్ స్కాం బయట పెట్టానని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల దందాపై కూడా పక్కా ఆధారాలతోనే మాట్లాడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేకు అన్నీ తెలిసే జరుగుతున్నాయా..? లేదా? అనే విషయం తనకు తెలియదన్నారు. తాను ఆరోపణలు చేయగానే బ్యాచ్‌లను దింపి అరిపించకుండా అసలు ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నారని, వెంటనే తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఏకానందం, గంప వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, బోయిని కొమురయ్య, నాయిని వెంకట్‌రెడ్డి, పాశం అశోక్‌రెడ్డి, బోయిని తిరుపతి, గడ్డి రమేశ్, సదయ్యగౌడ్ పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

విద్యానగర్, మే 24 : రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. లోహియా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై 'బంగారు రైతు' అవగాహన కార్యక్రమాన్ని కరీంనగర్‌లోని కెఎస్ఎల్ గార్డెన్‌లో శనివారం నిర్వహించగా, ఆమె హాజరై మాట్లాడారు. సాంప్రదాయ పంటలైన వరి మాత్రమే కాకుండా డిమాండ్ ఎక్కువగా ఉండి ఉత్పత్తి తక్కువగా ఉండే పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఒక సీజన్లో వరి వేస్తే మరో సీజన్లో మరో పంట వేయాలన్నారు. ఆయిల్ పాం సాగు ప్రయోజనకరమైనదని, ఇందులో అంతర పంట కూడా సాగు చేయవచ్చని సూచించారు. మూడేండ్లు కష్టపడితే 30 ఏండ్లపాటు నికర ఆదాయం వస్తుందని వివరించారు. సాగుకు ప్రభుత్వం నాలుగేండ్లపాటు ఎకరానికి రూ.51వేల సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. జిల్లాలో కేవలం 320 మంది రైతులు మాత్రమే 1200 ఎకరాల్లో సాగు చేస్తున్నారని, ఈ ఏడాది సాగు విస్తీర్ణాన్ని 3వేల ఎకరాల వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇక్కడ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, లోహియా సంస్థ సీఈవో సిద్ధాంత్ లోహియా, ప్రతీక్ పట్నాయక్ పాల్గొన్నారు.

## జనరల్ స్టోర్‌లో చోరీ

శంకరపట్నం, మే 24: మండల కేంద్రంలోని ఓ జనరల్ స్టోర్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. కరీంపేట్ గ్రామానికి చెందిన కార్కూరి శ్రీనివాస్ రెండున్నరేండ్లుగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమపంలో రేకుల టేలాలో జనరల్ స్టోర్‌తో పాటు జిరాక్స్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి షాపు మూసి ఇంటికి వెళ్లాడు. శనివారం తెల్లవారుజామున పేపర్ బాయ్ టేలా తెరిచి ఉండడం చూసి శ్రీనివాస్‌కు సమాచారం అందజేశాడు. వెంటనే స్టోర్‌కు వెళ్లి చూడగా టేలా తాళం పగులగొట్టబడి ఉంది. దొంగలు టేలాలో భద్రపరచిన రూ.17 వేల నగదుతో పాటు విక్రయించే హెల్మెట్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. మొత్తం రూ.40 వేల విలువ చేసే సొత్తును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ట్రెయినీ ఎస్ఐ సుమన్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.



తానాకాన్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

# వైద్యరంగంలో నూతన ఒరవడులను అవలంబించాలి

- ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్ నాయర్
- నగరంలో తానాకాన్-2025 సదస్సు ప్రారంభం

విద్యానగర్, మే 24: వైద్యరంగంలో వస్తున్న నూతన ఒరవడిలను అవలంభించాలని పాండిచ్చేరి ఫోరెన్సిక్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్ నాయర్ సూచించారు. శనివారం కరీంనగర్‌లోని ప్రతిమా మల్టీప్లెక్స్‌లో తెలంగాణ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (తానాకాన్-2025)ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని వైద్యులతో పాటు ఇతర రాష్ట్రాలలోని వైద్యులు పాల్గొననున్నారు. వైద్యరంగంలో వస్తున్న మార్పులతో తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యాన్ని అందించడమే సదస్సు లక్ష్యమన్నారు. మొదటి రోజు వివిధ అంశాలపై సంబంధిత వైద్యులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ అరుణ్ కటారి, ప్రెసిడెంట్ ఎలెక్ట్ తానా తెలంగాణ స్టేట్, వైద్యులు చాట్ల శ్రీధర్, రాజకుమార్, మంగీలాల్, సునీల్ రెడ్డి, మహేశ్, సూర్యనారాయణ రెడ్డి, జగన్ మోహన్ రావు, బి.ఎన్.రావు, విజేందర్ రెడ్డి, టీకేకే నాయుడు, లక్ష్మణ్, రఘురాం, విజయ మోహన్ రెడ్డి, శ్రీలత రెడ్డి, శైలజ, మమతారెడ్డి, వై నరేంద్ర, జయరాం, ఈ శైలజ, శేష శైలజ, రవికాంత్, రమణాచారి, రామ్ కిరణ్, ఇతర ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు. ఆదివారం మంత్రులు దామోదర రాజా నరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ, కేంద్రమంత్రి బండి సంజయ్, కరీంనగర్, జగిత్యాల, చొప్పదండి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సంజయ్ కుమార్, మేడిపల్లి సత్యం పాల్గొననున్నారు.



ప్రోగ్రెస్ కార్డులు అందుకున్న పిల్లలతో ఎంఈవో ప్రభాకర్‌రావు

## గట్టుభూత్కూర్‌లో వర్క్‌సైట్ స్కూల్ సక్సెస్

గంగాధర, మే 24: ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒరిస్సా, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలకు చెందిన కార్మికుల పిల్లల కోసం గట్టుభూత్కూర్‌లో ఏర్పాటు చేసిన వర్క్‌సైట్ స్కూల్ సత్ఫలితాలనిచ్చింది. కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చొరవతో విద్యాశాఖ అధికారులు రాష్ట్రంలోనే మొదటిసారిగా గత ఫిబ్రవరి 5న న వర్క్‌సైట్ స్కూల్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. 48 మంది కార్మికుల పిల్లలకు ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు, షూ, స్టేషనరీ అందజేశారు. దాదాపు మూడున్నర నెలల పాటు విద్యను బోధించారు. ఇటీవలే పరీక్షలు నిర్వహించగా, శనివారం ప్రోగ్రెస్ కార్డులు అందజేసినట్లు ఎంఈవో ఏనుగు ప్రభాకర్‌రావు తెలిపారు. వర్క్‌సైట్ పాఠశాల విజయవంతం కావడంలో ప్రత్యేక చొరవ చూపిన కలెక్టర్ పమేలా సత్పతికి కార్మికుల తరపున ఎంఈవో కృతజ్ఞతలు తెలిపారు.